



పోలింగ్ కేంద్రాలకు తరలుతున్న సిబ్బంది



డిస్ట్రిబ్యూషన్ పాయింట్‌లో టేబుల్స్‌పై పోలింగ్ సామగ్రిని సరిచూసుకుంటున్న సిబ్బంది

నేడే పోలింగ్

- ఏర్పాట్లు పూర్తి చేసిన అధికారులు
- 17,97,150 మంది ఓటర్లు
- బరిలో 28 మంది అభ్యర్థులు

కరీంనగర్, మే 12 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి): పార్లమెంట్ ఎన్నికలకు అధికార యంత్రాంగం సర్వంసిద్ధం చేసింది. సోమవారం ఉదయం 7 నుంచి సాయంత్రం 6 గంటల వరకు ప్రజలు ఓటు హక్కును వినియోగించుకునేందుకు పోలింగ్ కేంద్రాల వద్ద ఏర్పాట్లు పూర్తి చేశారు. 80 సంవత్సరాలు దాటిన వయోవృద్ధులకు ఇంటి వద్దనే హోం ఓటింగ్‌కు అవకాశం కల్పించారు. కరీంనగర్ పార్లమెంట్ నియోజకవర్గం లోని కరీంనగర్, హుజూరాబాద్, చొప్ప దండి, మానకొండూర్, హుస్నాబాద్, సిరిసిల్ల, వేములవాడ శాసనసభ నియోజకవర్గాల్లో 17,97,150 మంది ఓటర్లు తమ ఓటు హక్కును వినియోగించుకోనున్నారు. వీరిలో 8,77,483 మంది పురుషులు, 9,19,565 మంది మహిళా ఓటర్లు, 102 మంది ట్రాన్‌జెండర్ ఓటర్లు ఉన్నారు. పురుష ఓటర్ల కంటే 42,082 మంది మహిళా ఓటర్లే అధికంగా ఉన్నారు. 42 వేల మంది దివ్యాంగులు, 13,200 మంది వయోవృద్ధులు తమ ఓటు హక్కును వినియోగించుకు నేందుకు వీలుగా ప్రతి పోలింగ్ కేంద్రంలో ఒక వీల్ ఛైర్, వారు పోలింగ్ కేంద్రానికి వచ్చి ఓటు వేసేందుకు ఒక ఆటోను ఏర్పాటు చేశారు. వీరంతా ఓటు హక్కును వినియోగించుకునేందుకు 2,194 పోలింగ్ కేంద్రా లను ఏర్పాటు చేశారు. వీటిలో 288 సమస్యాత్మక కేంద్రాలుగా గుర్తించిన అధికారులు ఆయా కేంద్రాల్లో పటిష్ట బందో బస్తును ఏర్పాటు చేశారు. 10,200 మంది పోలింగ్ సి బ్బంది ఎన్నికల విధులను నిర్వహిస్తుండగా 2,500 మంది పోలింగ్ సిబ్బందితో గట్టిబందోబస్తును ఏర్పాటు చేశారు.

● పోలింగ్ కేంద్రాలకు చేరిన ఈవీఎంలు, ఉద్యోగులు, సిబ్బంది...

సోమవారం ఉదయం 7 గంటలకు ప్రారంభమయ్యే పోలింగ్ కోసం ఎన్నికల కమిషన్ అన్ని ఏర్పాట్లు పూర్తి చేసింది. పార్లమెంట్ నియోజక వర్గ పరిధిలోని ఏడు అసెంబ్లీ సెగ్మెంట్లకు డిస్ట్రిబ్యూషన్ కేంద్రాలను ఏర్పాటు చేసి ఆయా కేంద్రాల నుంచి జీపీఎస్ ట్రాకింగ్‌తోపాటు గట్టి బందోబస్తు మధ్య పోలింగ్ స్టేషన్లకు ఆదివారం రాత్రి వరకు ఈవీఎంలతో పాటు బీఎల్‌వోలు, ఉద్యోగులు, సిబ్బంది తరలివెళ్లారు. ఈ సందర్భంగా పోలింగ్ కేంద్రాల వద్ద భారీ బందోబస్తు ఏర్పాటు చేశారు. నియోజకవర్గ పరిధిలోని ఏడు అసెంబ్లీ సెగ్మెంట్లకు 5,500 బ్యాలెట్ యూనిట్లు, 2,743 కంట్రోల్ యూనిట్లు, 3,077 వీవీ ప్యాట్లను పోలింగ్ కేంద్రాలకు తరలించారు. ప్రతి శాసనసభా నియోజకవర్గానికి ఐదు చొప్పున ఏడు నియోజకవర్గాల్లో 35 మోడల్ పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేశారు. 1,012 పోలింగ్ స్టేషన్లలో వెబ్ కాస్టింగ్ నిర్వహించేలా ఏర్పాట్లు చేశారు. ఎన్నికల రిటర్నింగ్ అధికారి, కలెక్టర్ పమేలా సత్పతి పోలింగ్ ఏర్పాట్లను ప్రత్యక్షంగా పర్యవేక్షించి పకడ్బందీ ఏర్పాట్లు చేయాలని ఆదేశాలు జారీ చేశారు. ఎన్నికలు ప్రశాంతంగా ఓటర్లు నిష్పక్షపాతంగా, నిర్భయంగా ఓటుహక్కును వినియోగించుకునే విధంగా ఏర్పాట్లు చేయాలని సూచించారు.



హుజూరాబాద్ డిస్ట్రిబ్యూషన్ కేంద్రంలో ఈవీఎంల పనితీరును పరిశీలిస్తున్న కలెక్టర్ పమేలా సత్పతి

● పోలింగ్‌కు ఏర్పాట్లు పూర్తి: కలెక్టర్

హుజూరాబాద్, మే 12: కరీంనగర్ పార్లమెంట్ పరిధిలో సోమవారం పోలింగ్ పకడ్బందీగా నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లు చేశామని కలెక్టర్ పమేలా సత్పతి తెలిపారు. ఆదివారం హుజూరాబాద్ ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఈవీఎంల డిస్ట్రిబ్యూషన్ కేంద్రాన్ని ఆమె పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పోలింగ్ అధికారులు, సిబ్బంది ఎలక్షన్ కమిషన్ నియమ నిబంధనల ప్రకారం పోలింగ్ ప్రక్రియ పూర్తయ్యే వరకు బాధ్యతయుతంగా పని చేయాలన్నారు. సమస్యలు ఎదురైతే తమ దృష్టికి తీసుకురావాలన్నారు. పోలింగ్ కేంద్రాలకు కేటాయించిన బ్యాలెట్ యూనిట్స్, కంట్రోల్ యూనిట్స్, వీవీ ప్యాట్స్ తీసుకొని అప్రమత్తంగా వెళ్లాలని సూచించారు. మెటీరియల్‌ను సరిచూసుకోవాల న్నారు. ఈవీఎంలు తరలించే వాహనాలకు జీపీఎస్ అనుసంధానం చేశామని, పటిష్ట పోలీస్ బందోబస్తు మధ్య ఈవీఎంలను పోలింగ్ కేంద్రాలకు తరలిస్తున్నామన్నారు. పోలింగ్ పూర్తయిన తర్వాత జాగ్రత్తగా కరీంనగర్‌లోని స్ట్రాంగ్ రూములకు తరలించాలన్నారు. కార్యక్రమంలో ఎన్నికల పరిశీలకులు అమిత్ కటారియా, అదనపు కలెక్టర్లు ప్రఫుల్ దేశాయ్, లక్ష్మి కిరణ్, ఆర్డీవో రమేష్‌బాబు, తహసీల్దార్ విజయ్ కుమార్ పాల్గొన్నారు.



వెలిచాల మోడల్ పోలింగ్ కేంద్రం వద్ద కలెక్టర్, అదనపు కలెక్టర్, తదితరులు

ఓటు హక్కును నిర్భయంగా వినియోగించుకోవాలి

● కలెక్టర్ పమేలా సత్పతి

18 సంవత్సరాలు దాటిన వారంతా పార్లమెంట్ ఎన్నికల్లో ఓటు హక్కును తప్పకుండా వినియోగించుకోవాలని, ఓటు హక్కు వినియోగించుకోవడం సామాజిక బాధ్యతగా గుర్తించాలని కలెక్టర్, ఎన్నికల రిటర్నింగ్ అధికారి పమేలా సత్పతి ప్రజ లకు విజ్ఞప్తి చేశారు. ఎన్నికలు ప్రశాంతంగా జరిగేందుకు అన్ని ఏర్పాట్లు పకడ్బందీగా చేశామని అన్నారు. ఎండల తీవ్రతను దృష్టిలో ఉంచుకుని ఓటర్లకు, సిబ్బందికి ఎలాంటి ఇబ్బంది కలుగకుండా పోలింగ్ కేంద్రాల్లో కూ లర్లు, మంచినీటి వసతితోపాటు అత్యవసర వైద్య సేవల కోసం సిబ్బందిని అందుబాటులో ఉంచామని చెప్పారు. పోలింగ్ శాతం పెంచేందుకు ఈసారి ప్రత్యేక దృష్టిపెట్టామని, ప్రజలు విధిగా ఓటు హక్కును వినియోగించు కోవాలని కోరారు.



సెల్ఫీ పాయింట్ వద్ద కలెక్టర్ పమేలా సత్పతి



పోలింగ్ విధుల్లో పాల్గొన్న పారామెడికల్ సిబ్బందితో మాట్లాడుతున్న కలెక్టర్



ఎన్నికల సిబ్బందికి సూచనలు చేస్తున్న ఏఆర్‌వో, ఆర్డీవో కె.మహేశ్వర్



హుజూరాబాద్ లో మాట్లాడుతున్న కరీంనగర్ సీపీ మొహంతి



హుజూరాబాద్‌లో డిస్ట్రిబ్యూషన్ కేంద్రం నుంచి పోలింగ్ కేంద్రాలకు వెళ్తున్న సిబ్బంది



ఈవీఎంలతో బయలుదేరుతున్న సిబ్బంది

కరీంనగర్ నియోజకవర్గ స్వరూపం

● విస్తరించి ఉన్న జిల్లాలు

- కరీంనగర్ (పూర్తిగా..), రాజన్న సిరిసిల్ల (రుద్రంగి మండలంలోని మానాల గ్రామం తప్ప)
- జగిత్యాల, సిద్దిపేట, హన్మకొండ జిల్లాల్లోని కొన్ని మండలాలు

● మండలాలు

- రాజన్న సిరిసిల్ల జిల్లా నుంచి సిరిసిల్ల, ఎల్లారెడ్డిపేట, గంభీరావుపేట, ముస్తాబాద్, తంగళ్లపల్లి, వీర్నపల్లి, ఇల్లంతకుంట, బోయినపల్లి, వేముల వాడ, వేములవాడ రూరల్, కోనరావుపేట, చందుర్తి, రుద్రంగి (ఈ మండలంలోని మానాల గ్రామం నిజామాబాద్ పార్లమెంట్ స్థానంలో ఉంది)
- సిద్దిపేట జిల్లా నుంచి బెజ్జంకి, కోహెడ, అక్కన్నపేట, హుస్నాబాద్ మండలాలు
- హన్మకొండ జిల్లా నుంచి కమలాపూర్, భీమదేవరపల్లి, ఎల్కతుర్తి మండలాలు
- జగిత్యాల జిల్లా పరిధిలోని మల్యాల, కొడిమ్యాల, కథలాపూర్, మేడిపల్లి, భీమారం మండలాలు

● పోలింగ్ స్టేషన్లు

- మొత్తం పోలింగ్ స్టేషన్లు 2,194



సమస్యాత్మక పోలింగ్ కేంద్రాలు 288

- పోలింగ్‌కు 13,635 మంది అధికారులు, సిబ్బందిని వినియోగిస్తున్నారు.

● జనాభా

- కరీంనగర్ పార్లమెంట్ స్థానంలో 23.83 లక్షల జనాభా ఉంది.

● ఓటర్లు

- మొత్తం ఓటర్లు: 17,97,150
- పురుషులు: 8,77,483
- మహిళా ఓటర్లు: 9,19,565
- ట్రాన్స్ జెండర్లు: 102
- పీడబ్ల్యూడి 41,718 ఓటర్లు
- 85 సంవత్సరాలు దాటిన ఓటర్లు 13,780

ధర్మాన్ని రక్షించండి..
ప్రజాస్వామ్య స్ఫూర్తిని కాపాడండి

● ఎంపీ, బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు బండి సంజయ్‌కుమార్



భగత్‌నగర్, మే 12: ధర్మాన్ని రక్షించాలని, ప్రజాస్వామ్య స్ఫూర్తిని కాపాడాలని బీజేపీ జాతీయ ప్రధానకార్యదర్శి, కరీంనగర్ బీజేపీ ఎంపీ అభ్యర్థి బండి సంజయ్‌కుమార్ ఓటర్లకు ఓ ప్రకటనలో పిలుపునిచ్చారు. ప్రతి ఒక్కరూ ఓటు హక్కు వినియోగించుకోవాలన్నారు. ఎలాంటి ప్రలోభా లకు లొంగకుండా నిజాయితీగా, నిష్పక్షపా తంగా ఓటు వేయాలని కోరారు. ప్రజాస్వా మ్యాన్ని బలోపేతం చేయడానికి, మీరు కోరుకునే ప్రభుత్వాన్ని ఏర్పాటు చేసుకోడానికి ఓటు హక్కును వినియోగించుకోవా లన్నారు. ఎన్నికల సంఘం అధికారులు సైతం ఎలాంటి అవాంఛనీయ సంఘటనలకు తావివ్వ కుండా ప్రశాంతంగా ఎన్నికలు జరిగేలా చర్యలు తీసుకోవాలన్నారు.

● ఏరులై పారుతున్న డబ్బు, మద్యం

కరీంనగర్ పార్లమెంట్ నియోజకవర్గ పరిధిలో డబ్బు, మద్యం ఏరులై పారుతోందని బీజేపీ జాతీయ ప్రధాన కార్యదర్శి, బీజేపీ ఎంపీ అభ్యర్థి బండి సంజయ్‌కుమార్ ఓ ప్రకనటలో విమర్శించారు. అధికార పార్టీ కాంగ్రెస్ ఇంటింటి డబ్బు, మద్యం పంపిణీ చేస్తుంటే ఎన్నికల సంఘం ఏం చేస్తోందని ప్రశ్నించారు. ఓటుకు వెయ్యి రూపాయలు, హాఫ్ బాటిల్ మందు పంచుతున్నారని ఆరోపించారు. సీ విజిల్ యాప్‌లో ఫిర్యాదు చేస్తే చర్యలు తీసుకోకుండా ఆ సమాచారంతో దొంగలను కాపాడుతున్నారన్నారు. తక్షణమే డబ్బు, మద్యం పంపిణీని నిలువరించకపోతే బీజేపీ కార్యకర్తలు కార్యాచరణకు సిద్ధమవుతారన్నారు. నియోజక వర్గం పరిధిలోని అనేక గ్రామాలు, మండలాల నుంచి బీజేపీ కార్యకర్తలు తనకు సమాచారం అందిస్తున్నారన్నారు. కరీంనగర్‌లో కాంగ్రెస్ పార్టీ అడ్డదారుల్లో గెలువాలని చూస్తోందని విమర్శించారు. అధికారులు, పోలీసుల సహకారం లేకుండా ఇంటింటికి డబ్బులు పంపిణీ చేయడం సాధ్యమా అని ప్రశ్నించారు. కరీంనగర్ నియోజక వర్గంలో ఎన్నికల కమిషన్ ప్రత్యేక నిఘా ఏర్పాటు చేయాలని కోరారు. తక్షణమే రాష్ట్ర ఎన్నికల సంఘం జోక్యం చేసుకుని డబ్బు, మద్యం పంపిణీ చేస్తున్న పార్టీలు, మద్యం పంపిణీ చేస్తున్న నాయకులపై చర్యలు తీసుకోవాలని కోరారు. కరీంనగర్ పార్లమెంట్ ప్రజలు డబ్బులకు అమ్ముడుపోయే వాళ్లు కాదనే సంగతి గుర్తుంచుకోవాలన్నారు.

ఓటు హక్కును వినియోగించుకోండి

● మంత్రి పొన్నం ప్రభాకర్



కరీంనగర్ అర్బన్, మే 12: ప్రతి ఒక్కరూ తమ ఓటుహక్కును వినియోగించుకోవాలని రవాణా, బీసీ సంక్షేమశాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ ఓ ప్రకటనలో విజ్ఞప్తి చేశారు. ప్రజాస్వామ్యాన్ని కాపాడేం దుకు మనకు ఇచ్చిన ఓటు అనే ఆయుధాన్ని వినియోగించుకొన ట్లయితే ప్రజాస్వామ్యంలో మనం ఉండి లేనట్లే.. అని పేర్కొన్నారు. భారత ఎన్నికల సంఘం చెబుతున్నట్లు దయచేసి ప్రతి ఓటరు రేపు సెలవు అని భావించకుండా సామాజిక బాధ్యతగా భావించి హక్కు ను వినియోగించుకోవాలని కోరారు.

పలుచోట్ల గాలివాన.. ప్రజల ఇబ్బందులు



కంచర్లలో విరిగిపడిన కరెంటు స్తంభం



చందుర్తి మండలంలో మృతి చెందిన ఆవు వద్ద రైతు మల్లారెడ్డి

ఎల్లారెడ్డిపేట, మే 12: ఎల్లారెడ్డిపేట మండలంలో ఆదివారం ఉరుములు, మెరుపులతో కూడిన గాలివాన కురిసింది. సుమారు గంటపాటు గాలివానకు మండల కేంద్రంతోపాటు, అక్కపల్లి, తిమ్మాపూర్, గుండారం తదితర గ్రామాల్లో చెట్లు నేలకూలాయి. రాకపోకలకు అంతరాయం కలుగకుండా స్థానికులు, యువకులు చెట్లను తొలగించారు. వరి ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో ధాన్యాన్ని కాపాడుకునేందుకు రైతులు అవస్థలు పడ్డారు. ధాన్యం కుప్పలపై ప్లాస్టిక్ కవర్ల కప్పారు. కొనుగోలు కేంద్రాలకు తీసుకు వచ్చిన ధాన్యం తూకం వేయడంలో నిర్లక్ష్యం వల్ల ఒక్కసారిగా వచ్చే వానకు తడిసిపోతోందని రైతులు ఆందోళన వ్యక్తం చేశారు. కొనుగోళ్లను వేగవంతం చేయాలని కోరారు.

వీర్నపల్లిలో విరిగిపడిన స్తంభాలు

వీర్నపల్లి: వీర్నపల్లి మండల కేంద్రంతో పాటు కంచర్ల గ్రామంలో ఆదివారం ఈదురుగాలులతో కూడిన గాలివానకు కరెంటు స్తంభాలు నెలకొరిగాయి. పలు గ్రామాల్లో కొనుగోలు కేంద్రాల్లో ఈదురుగాళ్లకు టార్పాలిన్ కవర్లు ఎగిరిపోవడంతో వరి ధాన్యం తడిసింది. కొన్నిచోట్ల తూకం వేసిన ధాన్యం బస్తాలు తడిశాయి. అకాల వర్షాలతో రైతులు ఇబ్బందులు పడుతున్నారు. కొనుగోలు కేంద్రాల్లో దాన్యం వెంటనే కొనుగోలు చేసేలా అధికారులు చర్యలు చేపట్టాలని రైతుల కోరుతున్నారు.

పిడుగుపాటుతో ఆవు మృతి

చందుర్తి: మండలంలో ఆదివారం ఉరుములు, మెరుపులతో కురిసిన వర్షంతో పాటు పిడుగు పడటంతో మండలంలోని నర్సింగాపూర్ గ్రామంలో ఓ ఆవు మృతి చెందింది. గ్రామస్థుల కథనం ప్రకారం గ్రామానికి చెందిన పూదూరు మల్లారెడ్డి చెందిన ఆవు పిడుగు పడి మృతి చెందింది. ఆవు విలువ దాదాపు రూ 50 వేలు ఉంటుందని, బాధిత రైతులు ప్రభుత్వం ఆదుకోవాలని గ్రామస్థులు కోరారు.

కొడిమ్యాల మండలంలో..

కొడిమ్యాల: కొడిమ్యాల మండలంలో ఆదివారం మధ్యాహ్నం స్వల్పంగా వర్షం కురిసింది. దీంతో వాతావరణం చల్లబడింది. ప్రజలకు ఉక్కపోత నుండి ఉపశమనం లబించింది. అరగంట సేపు వీచిన ఈదురు గాలులకు కోనాపూర్ నుంచి కొడిమ్యాలకు వచ్చు దారిలో చెట్టు నేల కూలింది, తిర్మాలాపూర్ గ్రామంలో వీచిన ఈదురు గాలులకు అదె గ్రామానికి చెందిన తైదల అంజయ్య, శాంతయ్యకు చెందిన ఇళ్ల రేకులు లేచిపోయినట్లు గ్రామస్థులు తెలిపారు.

ఖనిలో భారీ వర్షం

కళ్యాణ్‌నగర్, మే 12: నిన్న మొన్నటి వరకు భానుడి ప్రతాపంతో భగభగమన్న రామగుండం పారిశ్రామిక ప్రాంతం ఆదివారం సాయంత్రం కారుమబ్బులు కమ్ముకుని వర్షం కురిసింది. ఆదివారం పగలు 40.5డిగ్రీల ఉష్ణోగత నమోదు కాగా కనిష్ట ఉష్ణోగ్రత 28.0డిగ్రీలు నమోదయింది. మే లో భానుడు ప్రతాపం చూపగా ఆదివారం కురిసిన వర్షంతో కొంత ఉపశమనం కలిగింది. ఎన్నికల నేపథ్యంలో ఆయా పోలింగ్ సెంటర్లకు ఈవీఎంలు చేరిన తరువాత వర్షం పడడంతో అధికారులు ఊపిరి పీల్చుకున్నారు.



కొడిమ్యాలలో లేచి కింద పడిన రేకులు



కొడిమ్యాలలో విరిగిపడిన చెట్టు



గోదావరిఖనిలో కురుస్తున్న వర్షం

మాతృమూర్తులకు ఘన సన్మానం



మళయాళ సద్గురు గీతామందిరంలో సన్మానం

కరీంనగర్ కల్చరల్, మే12: ఆది శంకరాచార్యులు, భగవద్రామానుజుల జయంతి, అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా ఆదివారం అశోక్‌నగర్ మళయాళ సద్గురు గీతామందిరంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. గీతాభక్త సమాజం సభ్యులు మఠాధిపతి విష్ణుసేవానందగిరిస్వామికి పాదపూజ చేశారు. స్వామీజీ ప్రవచనం చేస్తూ రామానుజ, శంకరాచార్యుల వైభవాన్ని, మాతృ మూర్తుల ప్రాశస్త్యాన్ని వివరించారు. మహిళా దినోత్సవంలో భాగంగా 62 మంది మాతృమూర్తులకు సన్మానం చేశారు. కార్యక్రమంలో సమాజం అధ్యక్షుడు బండ సత్తయ్య, కార్య నిర్వాహకుడు వుప్పల రామేశం, సభ్యులు గుండ రాధాకిషన్, వేంకటయ్య, దామోదర్, భూపతి, గంగన్న, రవీందర్, ప్రభాకర్, సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

సమస్యాత్మక పోలింగ్ కేంద్రాల పరిశీలన



కరీంనగర్‌లో సమస్యాత్మక పోలింగ్ కేంద్రంను పరిశీలిస్తున్న సీపీ



ఎన్నికల విధులకు హాజరైన పోలీస్ సిబ్బంది

కరీంనగర్ క్రైం, మే 12: కమిషనరేట్ వ్యాప్తంగా ఉన్న పలు సమస్యాత్మక పోలింగ్ కేంద్రాలను సీపీ అభిషేక్ మొహంతి ఆదివారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎన్నికల ప్రక్రియ ముగిసే వరకు సిబ్బంది అప్రమత్తంగా ఉండాలన్నారు. పోలింగ్ కేంద్రం వద్ద సమస్యలు ఉంటే తన దృష్టికి తీసుకురావాలన్నారు. ఏదైనా శాంతి భద్రతల సమస్య తలెత్తితే వెంటనే అందుబాటులో వుండే సమీప అధికారులకు తెలియజేయాలన్నారు. పోలింగ్ కేంద్రం వద్ద జనం గుమిగూడకుండా చర్యలు తీసుకోవాలని, ఎటువంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా జాగ్రత్తలు వహించాలని సూచించారు.

● డిస్ట్రిబ్యూషన్ సెంటర్ల సందర్శన

కరీంనగర్‌లోని ఎస్సారార్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల, సిరిసిల్ల బైపాస్ రోడ్డులో గల ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల, హుజూరాబాద్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలల్లో ఏర్పాటు చేసిన డిస్ట్రిబ్యూషన్ సెంటర్లను సీపీ అభిషేక్ మొహంతి ఆదివారం సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఓటు వేసేందుకు వచ్చే మహిళలు, వృద్ధులతోపాటు అన్ని వర్గాల ప్రజలతో సిబ్బంబది సత్ప్రవర్తనతో మెలగాలన్నారు. ప్రిసైడింగ్ అధికారి అనుమతి లేనిదే ఎట్టి పరిస్థితుల్లో పోలింగ్ కేంద్రాంలోకి వెళ్లవద్దని, వారు పిలిస్తేనే వెళ్ళాలని సూచించారు. ఎప్పటికప్పుడు అప్రమత్తంగా ఉంటు ఎన్నికలు ప్రశాంతంగా ముగిసేలా కృషి చేయాలన్నారు.

విస్తృతంగా వాహన తనిఖీలు

కరీంనగర్ క్రైం, మే 12 : పోలీస్ కమిషనరేట్ వ్యాప్తంగా ఆదివారం రాత్రి విస్తృతంగా వాహన తనిఖీలు నిర్వహిస్తున్నారు. కరీంనగర్ పట్టణంలోని లాడ్జిలు, హోటల్లలో సైతం తనిఖీలు కొనసాగుతున్నాయి. లోకసభ ఎన్నికలకు పోలింగ్ ప్రక్రియ మరికొన్ని గంటల్లో ప్రారంభం కానుండగా, రాత్రి సమయంలో అక్రమ డబ్బు, మద్యం, బహుమతులు పంపిణీలను అరికట్టేందుకు విస్తృతస్థాయిలో తనిఖీలు నిర్వహిస్తున్నామని తెలిపారు.

ఇష్టారాజ్యంగా చెరువు మట్టి తరలింపు



కనగర్తి చెరువులో అక్రమంగా మట్టి తరలించగా ఏర్పడిన గొయ్యి

ఇల్లందకుంట, మే 12: ఇల్లందకుంట మండలం కనగర్తి గ్రామానికి చెందిన చెరువులో ఇష్టారాజ్యంగా చెరువు మట్టి తరలిస్తున్నారని గ్రామస్థులు పేర్కొంటున్నారు. ఎలాంటి అనుమతులు లేకుండా ప్రభుత్వ నిబంధనలకు విరుద్ధంగా చెరువులోని మట్టిని గృహాలకు తరలిస్తున్నట్లు ఆరోపణలు వస్తున్నాయి. ఈ విషయంపై మండలాధికారులకు ఎన్నిసార్లు ఫిర్యాదు చేసినా చూసిచూడనట్లు వ్యవహరిస్తున్నారని జిల్లా కాంగ్రెస్ పార్టీ ఫిషర్‌మెన్ చైర్మన్ బండి మల్లేష్ అన్నారు. ఆదివారం మండలంలోని కనగర్తి గ్రామ చెరువులో అక్రమంగా మట్టిని తోడిన ప్రాంతాన్ని ఆయన పరిశీలించి మాట్లాడారు. కనగర్తి గ్రామానికి చెందిన చెరువులు, కుంటలలోని మట్టిని అమ్ముకుంటూ అధికారులు, రాజకీయ పార్టీ నాయకులకు ముడుపులు అప్పచెప్పుతూ చెరువులను అన్యక్రాంతం చేస్తున్నారన్నారు. చెరువుల్లో మట్టిని తీసే జేసీబీ, ట్రాక్టర్లకు సరైన పత్రాలు లేవని గ్రామాల్లో విచ్చలవిడిగా అక్రమ మట్టి మాఫియా కొనసాగుతుందన్నారు. ప్రతి సంవత్సరం ఎండకాలం వచ్చిందంటే చెరువులో నీరు ఎండిపోగానే మట్టి తవ్వకాలకు తెరతీస్తూ గ్రామంలో ఉన్న చెరువులను పనికి రాకుండా చేస్తున్నారని ఆరోపించారు. దీనిపై ప్రభుత్వాధికారులు స్పందించి చెరువులను కాపాడాలని ఇల్లందకుంట మండల ప్రజలు కోరుతున్నారు.

చేపల వేటకు వెళ్లి ఒకరి గల్లంతు

ఎల్లారెడ్డిపేట, మే 12: ఎల్లారెడ్డిపేట మండలం గొల్లపల్లి గ్రామానికి చెందిన వ్యక్తి ఆలకుంట రాజు(35) గ్రామ శివారులోని కొత్తకుంట చెరువులో చేపల వేటకు వెళ్లి ఆదివారం రాత్రి గల్లంతు అయ్యాడని కుటుంబ సభ్యులు, పోలీసుల తెలిపారు. విషయం తెలుసుకున్న ఎస్ఐ రమాకాంత్ ఆధ్వర్యంలోని పోలీసులు స్థానికుల సహాయంతో రాజు కోసం గాలింపు చర్యలు చేపట్టారు. కుటుంబ సభ్యులు, పోలీసుల కథనం మేరకు.. గ్రామంలోని రాజు కూలీ పనులు చేస్తూ కుటుంబాన్ని పోషిస్తుండేవాడు. ఆదివారం రాత్రి చేపల వేటకు మరో వ్యక్తితో కలిసి వెళ్లిన అతను చీకటి పడిన ఇంటికి తిరిగి రాకపోవడంతో అనుమానం వచ్చిన కుటుంబ సభ్యులు కొత్తకుంట వద్దకు చేరుకున్నారు. గట్టున బట్టలు, చెప్పులు కనిపించడంతో నీటిలో మునిగిపోయాడని రాజుతో వెళ్లిన వ్యక్తి పేర్కొంటున్నాడు. ఘటన స్థలానికి చేరుకున్న పోలీసులు, కొత్తకుంటలో రాజు కోసం గాలింపు చర్యలు చేపట్టారు. ఓ వైపు చీకటి ఉండడం.. మరో వైపు వర్షం కురవడం వల్ల గాలింపునకు ఆటంకం ఏర్పడింది. భార్య సునీత, తల్లిదండ్రులు నర్సవ్వ, లింగయ్య, కొడుకు అక్కడకు చేరుకుని భోరున విలపిస్తున్నారు. సోమవారం గాలింపు చర్యలు చేపడుతామని పోలీసులు వివరించారు.

వడదెబ్బతో మహిళ మృతి

శంకరపట్నం, మే 12: శంకరపట్నం మండలంలోని కొత్తగట్టు గ్రామానికి చెందిన కనుకుట్ల రాధా (40) అనే మహిళ ఆదివారం వడదెబ్బకు గురై మృతి చెందినట్లు గ్రామస్థులు తెలిపారు. రెండ్రోజు లుగా ఎండ తీవ్రత ఉద్రిక్తంగా ఉండడంతో తట్టుకోలేక అస్వస్థతకు గురై మృతి చెందినట్లు గ్రామస్థులు పేర్కొన్నారు.

ప్రజాస్వామ్యంలో ఓటుకే ప్రాధాన్యం

● నిబంధనలు పాటిస్తేనే మేలు ● ఓటు హక్కు వినియోగానికి ఈసీ ఏర్పాట్లు ● నేడు లోక్‌సభ ఎన్నికల పోలింగ్

జగిత్యాల, మే 12 (ఆంధ్రజ్యోతి): ప్రజాస్వామ్యంలో ఓటుకే ప్రాధాన్యం దక్కుతుంది. ఓటు హక్కు వినియోగానికి ఎన్నికల సంఘం అమలు చేస్తున్న నిబంధనలను పాటిస్తేనే ప్రయోజనం చేకూరుతుంది. అర్హులందరూ ఓటు వేసేలా ఎన్నికల సంఘం ఏర్పాట్లు పూర్తి చేసింది. ఓటు సాధారణంగా అందరికీ ఒకేలా ఉంటుంది. కానీ అదే ఓటును కొన్ని సమయాల్లో వేరే పేరుతో పిలుస్తారు.

● జాబితాలో పేరు లేకుంటే..

ఓటరు తన ఓటు హక్కును వినియోగించుకోవాలంటే ఓటరు జాబితాలో తప్పనిసరిగా పేరు ఉండాల్సిందే. ఒకవేళ పేరు లేకుంటే ఓటు హక్కు వినియోగానికి అనర్హుడు. ఓటరు తన ఓటు ఏ పోలింగ్ బూత్‌లో ఉందనేది అందుబాటులో ఉండే బీఎల్‌వోల ద్వారా తెలుసుకోవాలి. బీఎల్‌వోలు ఇచ్చిన ఓటరు స్లిప్ వెనుకాల ఉన్న క్యూఆర్ కోడ్‌ను స్కాన్ చేస్తే పోలింగ్ కేంద్రం సమాచారం లభిస్తుంది.

● టెండర్ ఓటుకు అవకాశం

ఓటు వేసేందుకు పోలింగ్ కేంద్రానికి వెళ్లిన వ్యక్తి అప్పటికే వేరే వ్యక్తి తన ఓటును వినియోగించుకున్నాడని తెలిస్తే సదరు ఓటరు ఎన్నికల నిబంధనల మేరకు 49-ఏ ప్రకారం టెండర్ ఓటేసే అవకాశం ఉంటుంది. ఈ ఓటు వేసే వ్యక్తి ఈవీఎంల ద్వారా వేయడానికి వీలులేదు. బ్యాలెట్ రూపంలో ఓటు వేసే అవకాశం ఉంది. దీనికి సంబంధించిన ప్రక్రియ పీఓ ఆధ్వర్యంలో నిర్వహిస్తారు. ఏపీఓ, అభ్యర్థుల పోలింగ్ ఏజెంట్ల సమక్షంలో ఓటరు జాబితాను చెక్ చేసుకుంటారు. ఇప్పుడున్న పరిస్థితిలో దొంగ ఓట్లు వేసే అవకాశం లేదు. జిల్లాలో ఎక్కడా టెండర్ ఓటు నమోదు కాదని అధికారులు స్పష్టం చేస్తున్నారు.

● వీరికే అనుమతి

పోలింగ్ కేంద్రాలకు ఎన్నికల్లో పోటీ చేసే అభ్యర్థులు, వారి ఏజెంట్‌లకు అవకాశం ఉంటుంది. ఓటరుతో పాటు పసిపిల్లలకు అవకాశం ఉంది. పోలింగ్ సిబ్బంది, మైక్రో అబ్జర్వర్స్, సెక్టోరల్ అధికారులు, ఈసీఐ ద్వారా అనుమతి పొందిన విలేకరులు, ఈసీఐ ద్వారా అనుమతి పొందిన ఇతరులు పోలింగ్ కేంద్రాలకు వెళ్లేందుకు అవకాశం ఉంటుంది.



● వీవీ ప్యాట్‌తో

ఈవీఎంల ద్వారా ఓటు వేస్తే ఓటు పడుతుందా లేదా అనే సందేహాలు వ్యక్తమవుతున్నాయి. అందుకే ఎన్నికల సంఘం వీవీ ప్యాట్ యంత్రాల ద్వారా సమస్యకు పరిష్కారం చూపింది. వీవీప్యాట్ తెరపై ఓటరు వేసిన గుర్తు కనబడుతుంది. దానితో ఓటరు తాను వేసిన ఓటును నిర్ధారించుకుంటారు. వేసిన ఓటు వీవీ ప్యాట్‌పై కనబడితే పారదర్శకంగా ఓటు వేసినట్లు లెక్క. లేకుంటే పీఓకు ఫిర్యాదు చేయాలి.

● నిబంధనలు పాటించాల్సిందే

ఓటు హక్కును వినియోగించుకునేవారు తప్పనిసరిగా ఎన్నికల నిబంధనలు పాటించాలి. పోలింగ్ కేంద్రాల వద్ద అభ్యర్థుల గుర్తులు, కండువాలు, వస్త్రాలను ధరించవద్దు. సెల్‌ఫోన్లను తమ వెంట తీసుకెళ్లకూడదు. ఓటు హక్కు వినియోగానికి పోల్ స్లిప్ ప్రమాణికం కాదు. ఎన్నికల సంఘం నిబంధనల మేరకు 16 ధ్రువ పత్రాలలో ఏదైనా ఒకటి తీసుకెళ్తే ఓటు వేసేందుకు అవకాశం ఉంది.

● ఓటింగ్ ప్రక్రియ ఇలా..

ప్రతి పోలింగ్ కేంద్రంలో ప్రిసైడింగ్ అధికారి (పీవో), అదనపు ప్రిసైడింగ్ అధికారి (ఏపీఓ) ఇద్దరు ఇతర పోలింగ్ అధికారులు (ఓపీఓ) విధులు నిర్వహిస్తారు. ఓటర్లు వీరికి సహకరించి ఓటు హక్కు వినియోగించుకోవాల్సి ఉంటుంది. మొదట ఏపీఓ ఓటు వేయడానికి వచ్చిన వ్యక్తి పేరును పోలింగ్ కేంద్రంలోని ఓటరు జాబితాలో ఉంటే ఓటరు గుర్తింపు, క్రమసంఖ్య పేరు గట్టిగా చదివి వినిపిస్తారు. అభ్యర్థులకు సంబంధించిన ఏజెంట్లు సరేనని ఒప్పుకుంటే ఓటరు ఎడమ చేతి చూపుడు వేలును చెక్ చేస్తారు. ఓపీఓ-1 మూడు బాధ్యతలు (ఓటరు సిరా చుక్క వేయడం, 17ఏ రిజిస్టార్‌లో పేరు నమోదు, ఓటరు స్లిప్ రాయటం) నిర్వహిస్తారు. దీని తర్వాత ఏపీఓ-2 దగ్గరకు వెళితే పోల్ స్లిప్ తీసుకొని కంట్రోల్ యూనిట్ (సీయూ)లో బటన్ నొక్కి ఓటేసే అవకాశం కల్పిస్తారు. ఓటరు ఓటు వేసే ప్రదేశానికి వెళ్లి ఓటు వేసి బయటకు రావాల్సి ఉంటుంది. ఇలా ఓటింగ్ ప్రక్రియ జరుగుతుంది.

● సందేహాలు ఉంటే పీవోకు ఫిర్యాదు చేయాలి

ఓటరుకు ఏమైనా అనుమానాలు, సందేహాలు ఉంటే ప్రిసైడింగ్ అధికారి (పీఓ) కు ఫిర్యాదు చేయవచ్చు. ఈ విధానాన్ని పీఓ పర్యవేక్షించి రెండు గంటకొకసారి నమోదు అయిన పోలింగ్ వివరాలను సెక్టోరియల్ ఆఫీసర్‌కు సమాచారం అందిస్తారు.

పోస్టల్ బ్యాలెట్ బాక్స్‌లు, స్ట్రాంగ్ రూంల వద్ద భద్రత

కరీంనగర్ టౌన్, మే 12: పోస్టల్ బ్యాలెట్, హోమ్ ఓటింగ్ బాక్సుల స్ట్రాంగ్ రూమ్‌ల వద్ద పటిష్ట భద్రత ఏర్పాటు చేస్తున్నామని కలెక్టర్ పమేలా సత్పతి తెలిపారు. ఇటీవల పోస్టల్ బ్యాలెట్ ద్వారా ఓటు హక్కు ఉద్యోగులు వినియోగించుకోగా, బ్యాలెట్ పత్రాలను, హోం ఓటింగ్ బ్యాలెట్ బాక్స్‌లను కలెక్టరేట్‌లో భద్రపరిచారు. కలెక్టరేట్‌లో భద్రపరిచిన బ్యాలెట్ బాక్స్‌లు రాజకీయ పార్టీల నేతల సమక్షంలో ఆదివారం రాత్రి కలెక్టరేట్ నుంచి ప్రత్యేక వాహనంలో ఎస్సారార్ డిగ్రీ కళాశాల స్ట్రాంగ్ రూమ్‌కు పోలీస్ బందోబస్తు మధ్య తరలించారు. స్ట్రాంగ్‌కు తరలించే ప్రక్రియను కలెక్టర్ పమేలా సత్పతి, పార్లమెంట్ నియోజకవర్గ జనరల్ అబ్జర్వర్ అమిత్ కటారియాతో కలిసి పర్యవేక్షించారు. స్ట్రాంగ్ రూంల వద్ద 24 గంటలపాటు బందోబస్తు ఏర్పాటు చేశామని, సీసీ కెమెరాలు ఏర్పాటు చేస్తున్నామని కలెక్టర్ తెలిపారు. కార్యక్రమంలో స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ ప్రఫుల్ దేశాయ్, ట్రైనీ కలెక్టర్ అజయ్ యాదవ్, డీఆర్వో పవన్‌కుమార్, ఆర్డీవో మహేశ్వర్, జడ్పీ సీఈవో శ్రీనివాస్, పరిశ్రమల శాఖ జీఎం నవీన్‌కుమార్, రాజకీయ పార్టీల నాయకులు సత్తినేని శ్రీనివాస్, మడుపు మోహన్, సయ్యద్ బర్కత్ అలీ, కళ్యాడపు ఆగయ్య, రాజేశ్‌గౌడ్ పాల్గొన్నారు.

ఘనంగా శంకర జయంతి ఉత్సవాలు

ధర్మపురి, మే 12: ధర్మపురి క్షేత్రంలోని లక్ష్మీనరసింహస్వామి అనుబంధ శ్రీ రామలింగేశ్వరస్వామి ఆలయంలో జగద్గురు ఆది శంకరాచార్యుల జయంతి ఉత్సవాలు ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఉదయం వేళలో ఆలయంలోని శంకరాచార్యులకు ఆలయ వేదపండితులు బొజ్జ రమేష్‌శర్మ, వేదపారాయణదారు పాలెపు ప్రవీణ్‌శర్మ, సామవేద పండితులు ముత్యాలశర్మ తదితర వేద బ్రాహ్మణుల మంత్రోచ్ఛరణల మధ్య అర్చకులు పంచోపనిషత్తులతో రుద్రాభిషేకం, హారతి మంత్రపుష్ప కార్యక్రమాలు నిర్వహించారు. భక్తులు స్వామి వారిని దర్శనం చేసుకున్నారు. భగవద్రామానుచార్యా జయంతి పురస్కరించుకుని ప్రధాన దేవాలయాల్లో గల అభిషేక మండపంలో రామానుజాచార్యా జయంతి వేడుకల్లో భాగంగా షోడశోపచార పూజ, పంచామృత అభిషేకం సూక్త పారాయణంతో, అష్టోత్తర శతనామ పూజ దివ్య ప్రభంద పారాయణం నిర్వహించారు. భక్తులు స్వామి వారిని దర్శనం చేసుకున్నారు. ఈ కార్యక్రమంలో స్థానిక వేదపండితులు మదు శంకర్‌శర్మ, సంగనభట్ల దిలీప్‌శర్మ, గుండి శ్రీనాథ్‌శర్మ, ఆలయ సూపరింటెండెంట్ ద్యావళ్ల కిరణ్‌కుమార్, సీనియర్ అసిస్టెంట్ అలువాల శ్రీనివాస్, అర్చకులు ద్యావళ్ల విశ్వనాథ్‌శర్మ, ఆలయ ఉప ప్రధాన అర్చకులు నేరెళ్ల శ్రీనివాసాచార్యులు, ముఖ్య అర్చకులు నంబి శ్రీనివాసాచారి, అర్చకులు చక్రపాణి కిరణ్‌కుమార్, అభిషేక్ పౌరోహితులు బొజ్జ సంతోష్‌కుమార్, రాజగోపాల్, జూనియర్ అసిస్టెంట్ దేవయ్య, భక్తులు తదితరులు పాల్గొన్నారు.

జగిత్యాల టౌన్ : జగిత్యాల జిల్లా కేంద్రంలోని శుభమస్తు ఫంక్షన్ హాలులో ఆదివారం జగద్గురు ఆది శంకరాచార్య జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా వేద బ్రాహ్మణుల ఆధ్వర్యంలో లోక కళ్యాణార్థం హోమం నిర్వహించారు. బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యురాలు బోగ శ్రావణి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో నిర్వాహకులు ఉన్నారు.



ధర్మపురి శ్రీ రామ లింగేశ్వర స్వామి ఆలయంలో పూజలు

కథలాపూర్ : అద్వైత సిద్ధాంత బోధకుడిగా, హిందువులకు నిత్య స్తోత్రాలను అందించిన జగద్గురువు ఆది శంకరాచార్యుల జయంతి వేడుకలు మండలంలోని సిరికొండలో గ్రామస్తులు ఘనంగా నిర్వహించారు. ఆదివారం యువకులు ఆది శంకరాచార్యుని చిత్రపటంకు పూలమాలలు వేసారు. సనాతన ధర్మం బలోపేతం చేయడానికి కాశికా, గోవర్ధన, శారదా, జ్యోతిర్మఠాలను స్థాపించిన ఘనత శంకరాచార్యునికే దక్కిందన్నారు. 108 స్తోత్రాలు, గ్రంధాలు రచించిన శంకరాచార్యున్ని ప్రతీ ఒక్కరూ ఆదర్శంగా తీసుకోవాలని కోరారు. ఈ సందర్భంగా మంచాల మధుసూధన్, దొమ్మాటి గంగనర్సయ్య, అల్లె గంగాధర్, కాశోజి భాస్కర్, నాంపల్లి శ్రీధర్, గట్ల మహేశ్, లస్మయ్య, కృష్ణ, రమేశ్ తదితరులు ఉన్నారు.

పోలింగ్‌కు సిద్ధం

ఉమ్మడి కరీంనగర్ జిల్లాలో పోలింగ్‌కు అధికారులు అంతా సిద్ధం చేశారు. డిస్ట్రిబ్యూషన్ కేంద్రాల నుంచి బందోబస్తు మధ్య పోలింగ్ స్టేషన్లకు ఆదివారం రాత్రి వరకు ఈవీఎంలతో ఎన్నికల సిబ్బంది తరలివెళ్లారు.



రామగుండం డిస్ట్రిబ్యూషన్ సెంటర్ నుంచి వెళ్తున్న ఎన్నికల సిబ్బంది



పెద్దపల్లిలో ఎన్నికల విధులకు తరలుతున్న సిబ్బంది



సిరిసిల్లలో సామగ్రితో ఎన్నికల విధులకు వెళ్తున్న సిబ్బంది



కోరుట్లలో ఎన్నికల విధులకు వెళ్తున్న సిబ్బంది



కరీంనగర్‌లో సామగ్రితో ఎన్నికల విధులకు వెళ్తున్న సిబ్బంది

పవర్‌లూం కార్ఖానాలో అగ్నిప్రమాదం



పవర్‌లూం కార్ఖానాలో మంటలను ఆర్పుతున్న సిబ్బంది

సిరిసిల్ల క్రైం, మే 12: సిరిసిల్ల పట్టణంలోని బివైనగర్‌లో అంబటి వేణు పవర్‌లూం కార్ఖాణాలో ఆదివారం తెల్లవారుజామున 2 గంటలకు అగ్నిప్రమాదం సంభవించింది. ఈ ప్రమాదంలో వస్త్ర ఉత్పత్తికి సంబంధించిన రూ 2.50 లక్షల ముడి సరుకు దగ్ధమైంది. పవర్‌లూం కార్ఖాణాలో అగ్నిప్రమాదం సంఘటనను వెంటనే స్థానికులు ఫైర్‌స్టేషన్‌కు తెలియజేయడం వల్ల అగ్నిమాపక యంత్రంతో ఫైర్‌మెన్‌లు సాబీర్, నాగరాజు, నవీన్‌కుమార్‌లు సంఘటనా స్థలానికి సకాలంలో చేరుకొని మంటలను ఆర్పివేశారు. అప్పటికే వస్త్ర ఉత్పత్తికి సంబంధించిన ముడిసరుకు కాలిబూడిదైంది. పవర్‌లూం కార్ఖాణాలో విద్యుత్తు షార్ట్ సర్క్యూట్ వల్ల ఈ ప్రమాదం చోటుచేసుకున్నట్లు అగ్నిమాపక ఇంచార్జి అధికారి టి. నర్సింహాచారి తెలిపారు.

వైభవంగా పార్వతీ కోటేశ్వరస్వామి కల్యాణం



కల్యాణానికి హాజరైన భక్తులు



కల్యాణం నిర్వహిస్తున్న అర్చకులు

వెల్గటూర్, మే 12: వెల్గటూరు మండలంలోని ప్రసిద్ధ పుణ్యక్షేత్రం కోటిలింగాలలో గోదావరి తీరాన కొలువై ఉన్న శ్రీ పార్వతీ కోటేశ్వర స్వామి కల్యాణం ఆదివారం అంగరంగ వైభవంగా జరిగింది. అందంగా అలంకరించిన కల్యాణ మంటపంపైన అమర్చిన పీఠంపై స్వామివారల ఉత్సవ విగ్రహాలను నిలిపారు. అర్చకులు నాగరాజు శర్మ, సంజీవ్ శర్మ, అన్వేష్ శర్మ, కార్తీక్, శివకిరణ్‌ల మంత్రోచ్ఛరణల మధ్య వైశాఖ శుక్ల పంచమి శంకర జయంతి సందర్భంగా ఆరుద్ర నక్షత్ర యుక్త అభిజిత్ లగ్న పుష్కరాంశ సుముహూర్తాన ఆలయ అర్చకులు నాగరాజు శర్మ, సంజీవ్ శర్మల ఆధ్వర్యంలో స్వామి వారి కల్యాణోత్సవాన్ని అంగరంగ వైభవంగా నిర్వహించారు. భక్తులు స్వామి వారల కల్యాణోత్సవాన్ని కనులారా వీక్షించి తరించారు. మహిళ భక్తులు స్వామి వారికి ఓడి బియ్యం సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు. అనంతరం రేగొండ వైకుంఠం కళావతి, రేగొండ రామన్న మల్లీశ్వరి దంపతుల ఆధ్వర్యంలో అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. కల్యాణం వీక్షించేందుకు పెద్ద సంఖ్యలో భక్తులు తరలివచ్చారు. ఆలయ కార్యనిర్వహాధికారి కాంతారెడ్డి ఆధ్వర్యంలో భక్తులకు ఇబ్బంది కలుగకుండా ఏర్పాట్లు చేశారు.

రోడ్డు ప్రమాదంలో ఒకరి మృతి

మానకొండూర్, మే 12: మండలంలోని దేశ్‌రాజ్‌పల్లిలో శనివారం అర్ధరాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో ఒక్కరు మృతిచెందగా ఇద్దరికి తీవ్రగాయాలు అయినట్లు ఎస్ఐ సురేందర్ తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం.. సుల్తానాబాద్ మండలంలోని నర్సయ్యపల్లి గ్రామానికి చెందిన మద్దెల తిరుపతి (39) అనే వ్యక్తి తన కుటుంబ సభ్యులతో కలిసి దైవదర్శనానికి ట్రాక్టర్‌లో శనివారం రాత్రి బయలుదేరారు. రామడుగు మండలంలోని దేశ్‌రాజ్‌పల్లి ఎక్స్ రోడ్డు వద్ద ట్రాక్టర్ వెనకాల వస్తున్న కారు ట్రాక్టర్‌ను ఢీకొంది. ఈ ప్రమాదంలో డ్రైవర్ తిరుపతి, అతనికి ఇరువైపులా కూర్చున్న కాడే జస్వంత్, తీట్ల విష్ణువర్ధన్ కిందపడిపోగా ముగ్గురికి తీవ్రగాయాలు అయ్యాయి. చికిత్స నిమిత్తం కరీంనగర్ ఆసుపత్రికి తరలించగా చికిత్స పొందుతూ ఆదివారం డ్రైవర్ తిరుపతి మృతి చెందినట్లు ఎస్ఐ తెలిపారు. మృతుడి భార్య లావణ్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఆయన తెలిపారు.

ఇరు వర్గాల ఘర్షణలో ముగ్గురికి గాయాలు

కోరుట్ల, మే 12: పట్టణంలోని పాత బస్టాండ్ సమీపంలోని పెట్రోల్ బంక్ వద్ద జరిగిన ఘర్షణలో ముగ్గురికి గాయలయినట్లు పోలీసులు తెలిపారు. రాజస్థాన్‌కు చెందిన దినేష్ జాట్, ఊరాంజాట్, నాన్‌రాంజాట్ కోరుట్ల పట్టణంలో ఐస్‌క్రీం వ్యాపారం నిర్వహిస్తున్నారు. వీరి వద్ద ఈశ్వర్ జాట్, రాజేష్ జాట్‌లు పనిచేసేవారు. ఇటీవల ఈశ్వర్ జాట్, రాజేష్‌జాట్‌లు స్వంతంగా ఐస్‌క్రీం వ్యాపారం చేపట్టారు. ఈ క్రమంలో మిగతా ముగ్గురితో విభేదాలు వచ్చాయి. శనివారం అర్ధరాత్రి వీరి మధ్య గొడవ చోటు చేసుకుంది. దీంతో ఈశ్వర్ జాట్, రాజేశ్వర్ జాట్‌లు దినిష్‌జాట్, ఊరాంజాట్, నాన్‌రాంజాట్‌లపై దాడి చేయడంతో వారికి తీవ్ర గాయాలు అయినట్లు పోలీసులు తెలిపారు. బాధితులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

రైలు ఢీకొని వ్యక్తి మృతి

జమ్మికుంట,మే12:పట్టణంలోని కొత్తపల్లికి చెందిన కల్లెపల్లి వెంకట రత్నం (45) గుర్తు తెలియని రైలు ఢీకొని మృతి చెందాడు. స్థానికుల వివరాల ప్రకారం.. వెంకటరత్నం టైల్స్ వ్యాపారం చేస్తున్నాడు. రైల్వే స్టేషన్‌కు దగ్గరలోని ఇంటికి వెళ్తుండగా రెండవ ప్లాట్ ఫాం దగ్గర గుర్తు తెలియని రైలు ఢీకొట్టడంతో మృతి చెంది ఉంటాడని తెలిపారు. రైల్వే పోలీసు హెడ్ కానిస్టేబుల్ జి తిరుపతి కేసు దర్యాప్తు చేస్తున్నట్టు తెలిపారు.మృతునికి భార్య సుకన్య ఇద్దరు పిల్లలు ఉన్నారు.

గోదావరిలో దూకి యువకుడి ఆత్మహత్య

ధర్మపురి, మే 12: పట్టణానికి చెందిన నూనె సత్యనారాయణ(35) అనే యువకుడు గోదావరి నదిలో దూకి ఆత్మహత్య చేసుకున్నాడు. ఎస్ఐ ఉదయ్‌కుమార్ తెలిపిన వివరాల ప్రకారం.. సత్యనారాయణ ఇంటిలో ఈనెల 11న మధ్యాహ్నం గొడవపడి బయటకు వెళ్లాడు. కుటుంబ సభ్యులు అతడి ఆచూకీ గురించి వెతికారు. ఆదివారం ఉదయం ధర్మపురికి చెందిన కొందరు జాలర్లు గోదావరి నది బ్రహ్మగుండం నీటిలో మృతదేహం ఉందని తెలిపారు. కుటుంబ సుభ్యులు వెళ్లి మృతదేహం సత్యనారాయణదిగా గుర్తించారు. ఇంట్లో గొడవ పడి ఆత్మహత్య చేసుకున్నట్లు మృతుడి అన్న నూనె శంకర్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ ఉదయ్‌కుమార్ తెలిపారు.

భారీగా నగదు, మద్యం పట్టివేత

● జగిత్యాల జిల్లాలో రూ. 3.97 కోట్ల నగదు స్వాధీనం

జగిత్యాల, మే 12 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో ఎన్నికల కోడ్ అమలు అయినప్పటి నుంచి ఇప్పటివరకు భారీగా నగదు, లిక్కర్, బంగారాన్ని పోలీసులు, అధికారులు స్వాధీనం చేసుకున్నారు. జిల్లాలో ఈనెల 10వ తేదీ వరకు సుమారు రూ. 3,97,36,336 విలువ గల నగదు, లిక్కర్, గోల్డ్, ఇతర వస్తువులను స్వాధీనం చేసుకున్నట్లు అధికారులు ప్రకటించారు. ఇందులో రూ. 2,21,53,310 నగదు ఉంది. అదేవిధంగా సుమారు రూ. 14,43,015 విలువ గల సుమారు 2,769 లీటర్ల లిక్కర్‌ను స్వాధీనం చేసుకున్నారు. సుమారు రూ. 67,45,011 విలువ ఇతర సామగ్రిని సీజ్ చేశారు. రూ. 90 లక్షల విలువల గల 1.506 కేజీల బంగారం, రూ. 3.95 లక్షల విలువ గల 15.81 గంజాయి పట్టుకున్నారు. జిల్లాలో ఇప్పటివరకు 612 మంది వ్యక్తులను బైండోవర్ చేశారు. 45 ఆయుధాలు డిపాజిట్ చేశారు.

మద్యం పట్టివేత

రాయికల్, మే12: మండలంలోని అల్లీపూర్ గ్రామంలో పోలీసులు వాహనాల తనిఖీలు చేపట్టగా వాహనంలో రెండు మద్యం కాటన్ బాటిళ్లు పట్టుబడ్డాయి. ఇందులో 96 రాయల్ స్టాగ్ 17 లీటర్ల మద్యం పట్టుబడినట్లు తెలిపారు. ఎన్నికల ప్రవర్తన నియమావళి ఉల్లంఘన కింద మద్యాన్ని ఎక్సైజ్ స్టేషన్‌కు తరలించి కేసు నమోదు చేసినట్లు తెలిపారు. ఎఫ్ఎస్‌టీ టీమ్ వన్ జి.కృష్ణారెడ్డి, ఏఆర్ ఎస్సై విద్యాసాగర్, కానిస్టేబుల్ రాహుల్ ఉన్నారు.

వైభవంగా రామానుజుల జయంతి

ఇల్లందకుంట, మే 12: ఇల్లందకుంట శ్రీసీతారామ చంద్రస్వామి దేవాలయంలో భగవత్ రామానుజుల 1007 జయంతి వేడుకలు ఆదివారం రాత్రి గ్రామ దేవాలయంలో వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రత్యేక పూజలు నిర్వహించిన అనంతరం రామానుజుల స్వామివారి ఉత్సమూర్తును ఘనంగా అలంకరించి, పల్లెకిలో అసీనులను చేసి బాజాభజంత్రిలు, మేళాతాళాలు నడుమ గ్రామ పురవీధుల గుండా ఊరేగించారు. భక్తులు అధిక సంఖ్యలో పల్లెకి సేవలో పాల్గొని పునకింతులయ్యారు.



రామానుజు స్వామివారికి పల్లకి సేవ

యుద్ధ ప్రాతిపదికన విద్యుత్ పునరుద్ధరణ



పనులు పరిశీలిస్తున్న విద్యుత్ శాఖ అధికారులు

గణేష్‌నగర్, మే 12: కరీంనగర్ డివిజన్ పరిధిలో ఆదివారం విద్యుత్ సరఫరాకు అంతరాయం కలగడంతో ఎస్ఈ వడ్లకొండ గంగాధర్ ఆధ్వర్యంలో యుద్ధప్రాతిపదికన పునరుద్ధరించారు. కరీంనగర్ సర్కిల్‌లోని రూరల్ డివిజన్ గుండిలో 15 కెవిఎ డిటిఆర్‌ను లారీ ఢీకొట్టడంతో విద్యుత్ సరఫరాకు అంతరాయం కలిగింది. రుద్రారం, రంగసాయిపల్లిలో విద్యుత్‌ను పునరుద్ధరించాలని అధికారులను ఆదేశించారు. కరీంనగర్ రూరల్ మండలం సిటిజన్ కాలనీలో 100 కెవిఎ ఓల్డ్ డీటీఆర్‌లో ఇంటర్నల్ సమస్యతో చెడిపోవడంతో తక్షణమే డీటీఆర్ ఏర్పాటు చేశారు. హుజూరాబాద్ డివిజన్ జమ్మికుంటలో గాలి దుమారంతో రెండు 8 మీటర్స్ పోల్స్ పడిపోవడంతో అధికారులు తక్షణమే స్పందించి పునరుద్ధరించారు. రైతులు, విద్యుత్ వినియోగదారులు ఏమైనా సమస్యలు ఉంటే కంట్రోల్ రూమ్ నంబర్ 9440811444కు ఫోన్ చేయాలన్నారు. ఈకార్యక్రమంలో డీఈ రూరల్ తిరుపతి, లక్ష్మారెడ్డి, ఏడీఈలు, సత్యనారాయణరెడ్డి, రాజేందర్, ఏఈలు తిరుపతి, శంకరయ్య సిబ్బంది పాల్గొన్నారు.

లాడ్జిలో ప్రింటింగ్ మిషన్

● పోలీసుల విచారణ

కరీంనగర్ క్రైం, మే 12: కరీంనగర్ బస్టాండ్ సమీపంలోని ఒక లాడ్జిలో ఆదివారం రాత్రి పోలీసులు నిర్వహించిన తనిఖీలలో ఒక ప్రింటింగ్ మిషన్‌తో ఉన్న వ్యక్తులను పోలీసులు విచారించారు. ఓ పార్టీకి చెందిన వారు పోలింగ్ చిట్టీలను ముద్రించేందుకు ఆ ప్రిటింగ్ మిషన్ కలిగిఉన్నట్లు విచారణలో వెల్లడైందని సీఐ సరిలాల్ తెలిపారు. కాగా లాడ్జిలో ఈవీఎం దొరికిందని ప్రచారం జరిగింది. దీనిని తప్పుడు ప్రచారంగా పోలీసు అధికారులు పేర్కొన్నారు.

పార్లమెంట్ ఎన్నికలకు సర్వం సిద్ధం

పోలింగ్ కేంద్రాలకు చేరుకున్న సిబ్బంది ● పోలీసుల భారీ బందోబస్తు మోడల్ పోలింగ్ కేంద్రాల ఏర్పాటు


హుజూరాబాద్‌లో డిస్ట్రిబ్యూషన్ కేంద్రం నుంచి పోలింగ్ కేంద్రాలకు తరలుతున్న సిబ్బంది


జమ్మికుంటలో పోలింగ్ కేంద్రానికి సామగ్రితో వెళ్తున్న ఎన్నికల సిబ్బంది


నగునూర్ పోలింగ్ కేంద్రానికి వెళ్తున్న సిబ్బంది

భగత్‌నగర్, మే 12: కొత్తపల్లి మండలంలోని నాగులమల్యాల, ఎలగందల్ గ్రామాల్లో ఓటర్లను ఆకర్షించే విధంగా ఎన్నికల అధికారులు మోడల్ పోలింగ్ స్టేషన్‌లను ఏర్పాటు చేశారు. కొత్తపల్లి మండలంలోని నాగులమల్యాల, ఎలగందల్ గ్రామాల్లో పోలింగ్ స్టేషన్‌లను సుందరంగా తీర్చిదిద్దారు. ఓటర్లను ఆకర్షించే విధంగా మోడల్ పోలింగ్ స్టేషన్‌లలో పూలతో అలంకరించి, షామియానాలు ఏర్పాటు చేశారు. మండలంలోని అన్ని పోలింగ్ స్టేషన్‌లలో వయోవృద్ధులు, గర్భిణులు, దివ్యాంగులు ఏలాంటి ఇబ్బందులకు లోనుకాకుండా అధికారులు ఏర్పాటు చేశారు.

● కరీంనగర్ రూరల్: పార్లమెంట్ ఎన్నికలకు కరీంనగర్ రూరల్ మండలంలోని గ్రామాల్లో ఎన్నికలకు అన్ని ఏర్పాట్లు చేశారు. మధ్యాహ్నం వరకు ఎన్నికల సిబ్బంది గ్రామాలకు చేరుకున్నారు. ఉదయం 7గంటల నుంచి సాయంత్రం 6గంటల వరకు ఎన్నికలు జరుగనున్న నేపథ్యంలో అన్ని పోలింగ్ కేంద్రాలకు ఈవీఎంలను తరలించారు. మొత్తం 68 పోలింగ్ కేంద్రాలు ఏర్పాటు చేశారు. ఆదివారం కరీంనగర్‌లోని ఎస్‌ఆర్‌ఆర్ డిగ్రీ కళాశాలలోని డిస్ట్రిబ్యూషన్ సెంటర్ నుంచి ఈవీఎంలు, వీవీ ప్యాడ్లను ఎన్నికల సిబ్బంది తీసుకుని తమకు కేటాయించిన గ్రామాలకు తరలివెళ్లారు. మొత్తం 280 మంది పోలింగ్ సిబ్బందిని కేటాయించారు. ఒక్కో పోలింగ్ కేంద్రంలో ఒక ప్రిసైడింగ్ అధికారి (పీవో), ఒక సహాక ప్రిసైడింగ్ అధికారి (అసిస్టెంట్ పీవో) ఇద్దరు సహాయ ప్రిసైడింగ్ సిబ్బంది విధులను నిర్వహిస్తారు. మండలంలో గుంటూరుపల్లి, నగునూర్ గ్రామాల్లో మహిళకోసం ప్రత్యేక పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేశారు. ఎన్నికల నేపథ్యంలో పోలీస్ అధికారులు పటిష్ట బందోబస్తు ఏర్పాట్లు చేశారు. 27,091 పురుషులు, 27,918 మహిళ ఓటర్లు, ఇతరులు 2 మంది ఓటు హక్కు వినియోగించుకోనున్నారు. దివ్యాంగుల కోసం పోలింగ్ స్టేషన్లలో ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. తాగు, నీడ వసతి సౌకర్య కల్పించగా మండల వైద్యాధికారులు, మెడికల్ సిబ్బంది అందుబాటులో ఉండనున్నారు. స్థానిక పోలీసులతో పాటు సీఐఎస్ఎఫ్ బలగాలతో బందోబస్తు నిర్వహించేందుకు ఏర్పాట్లు చేశారు. మొగ్దుంపూర్, బొమ్మకల్, తీగలగుట్టపల్లిలోని సమస్యత్మకమైన పోలింగ్ కేంద్రాల్లో ప్రత్యేకంగా సీసీ కెమెరాలు, వెబ్ కాస్టింగ్ నిర్వహించనున్నారు. శాంతి భద్రతల పరంగా 144సెక్షన్ అమలు చేస్తున్నట్లు కరీంనగర్ రూరల్ సీఐ ప్రదీప్‌కుమార్ తెలిపారు. పోలింగ్ సందర్భంగా ఏదైనా గొడవలు, వివాదాలు తలెత్తినట్లయితే వెంటనే అక్కడికి చేరుకునేందుకు ప్రత్యేక బలగాలు అందుబాటులో ఉంచినట్లు సీఐ తెలిపారు.

● హుజూరాబాద్: హుజూరాబాద్ నియోజకవర్గంలో సోమవారం జరిగే పార్లమెంట్ ఎన్నికల పోలింగ్ కోసం అధికారులు సర్వం సిద్ధం చేశారు. నియోజకవర్గంలో 305 పోలింగ్ కేంద్రాలు ఉండగా 82 సమస్యాత్మక కేంద్రాలు, 30 రూట్లు, 30జోన్లు, 550 పోలింగ్ సిబ్బందిని నియమించారు. సెక్టోరియల్ అధికారులు 30, వివి ప్యాడ్స్ 305, పోలీస్ సిబ్బంది 500, పోలింగ్ బూత్ వద్ద ఎస్ఐలతో పాటు ఏఎస్ఐ, సిబ్బందిని ఏర్పాట్లు చేశారు. హుజూరాబాద్ నియోజకవర్గంలో ఇద్దరు ఏసీపీల ఆధ్వర్యంలో నలుగురు సీఐలు, 12మంది ఎస్ఐలు, సీఆర్పీఎఫ్ సిబ్బంది భారీ బందోబస్తు ఏర్పాటు చేశారు. ఎలాంటి అల్లర్లు జరగకుండా ముందస్తుగానే అల్లర్లకు పాల్పడే వ్యక్తులను బైండోవర్ చేసినట్లు ఏసీపీ శ్రీనివాస్‌జీ తెలిపారు.

● సైదాపూర్: సైదాపూర్ మండలంలో పార్లమెంట్ ఎన్నికలు జరిగేందుకు అధికారులు అన్ని ఏర్పాట్లు పూర్తి చేశారు. మండలంలో 42 బూత్‌లు ఉండగా, 42మంది పీవోలు, 42మంది ఏపీవోలు, 84మంది ఓపీవోలను నియమించారు. అలాగే ప్రతి పోలింగ్ బూత్‌లో రూరల్ సీఐ వెంకట్ ఆధ్వర్యంలో ఎస్ఐ ఆరోగ్యం, పోలీస్, సీఆర్పీఎఫ్ సిబ్బంది భారీ బందోబస్తు నిర్వహిస్తారు.

● శంకరపట్నం: లోక్‌సభ ఎన్నికల పోలింగ్‌కు శంకరపట్నం మండలంలోని అన్ని పోలింగ్ కేంద్రాల్లో ఏర్పాట్లు చేశారు. పోలింగ్ సిబ్బంది పోలింగ్ కేంద్రాలకు చేరుకున్నారు. పీవో, ఏపీవో, ఓపీవోలతో పాటు బీఎల్వోలు, పోలింగ్ నిర్వహణకు కంపార్ట్‌మెంట్లు తదితర ఏర్పాట్లు పూర్తి చేశారు. మండలంలో మొత్తం 52 పోలింగ్ బూత్‌లు ఉన్నాయి. అందులో 18,577మంది పురుషులు, 18,973మంది మహిళా ఓటర్లు ఉండగా, మొత్తం 37,550ఓటర్లు తమ ఓటు హక్కును వినియోగించుకోనున్నారు. మండలంలో మూడు మోడల్ పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేశారు.

● జమ్మికుంట/జమ్మికుంట రూరల్: జమ్మికుంట మున్సిపాల్టీతో పాటు మండలంలో నిర్వహించే పార్లమెంట్ ఎన్నికలకు అధికారులు సర్వం సిద్ధం చేశారు. మండల వ్యాప్తంగా 77పోలింగ్ స్టేషన్లు ఏర్పాటు చేశారు. ప్రతి పోలింగ్ స్టేషన్‌కు నలుగురు ఎన్నికల సిబ్బంది విధులు నిర్వహించనున్నారు. ఓటర్లకు ఏలాంటి ఇబ్బందులు కలుగకుండా పోలింగ్ కేంద్రాల్లో తాగునీటి సదుపాయం, ఓఆర్ఎస్ ప్యాకెట్లు, వికలాంగుల కోసం వీల్ చైర్లు అందుబాటులో పెట్టనున్నారు. మొత్తం 77పోలింగ్ కేంద్రాల్లో 308మంది అధికారులు, సిబ్బంది పని చేయనున్నారు. అదేవిధంగా 47ప్రాంతాల్లో 77పోలింగ్ స్టేషన్లు ఉండగా, వాటిలో 150మంది పోలీస్‌లు బందోబస్తు నిర్వహించనున్నట్లు పట్టణ సీఐ వరంగంటి రవి తెలిపారు.

● ఇల్లందకుంట: ఇల్లందకుంట మండలంలోని పోలింగ్ కేంద్రాల్లో అన్ని ఏర్పాట్లు పూర్తి చేసినట్లు అధికారులు తెలిపారు. మండలంలోని 18 గ్రామాల్లో 28 బూత్‌లకు గాను 26,256మంది ఓటర్లు తమ ఓటు హక్కును వినియోగించుకోనున్నారు. అందులో మహిళ ఓటర్లు 13,435, పురుషులు 12,820, ఇతరులు 1 ఉన్నారు. మండలంలోని సిరిసేడు గ్రామంలో మహిళ ఆదర్శ పోలింగ్ కేంద్రాన్ని ఏర్పాటు చేశారు.

● మానకొండూర్: మానకొండూర్ నియోజకవర్గంలో సాధారణ ఎన్నికలకు అధికారులు పూర్తి ఏర్పాట్లు చేశారు. మండలంలో 6 మండలాలుండగా 316 పోలింగ్ స్టేషన్ ఉండగా మహిళలు 115314 ఓట్లు, పురుషులు 110209 ఓట్లు, తర్డ్‌జెండర్ ఒక్కరు మొత్తం ఓట్లు 225524 ఉన్నాయి. ఒక్కొక్క పోలింగ్ స్టేషన్‌కు నలుగురు చొప్పున మొత్తం 1264 మంది పివో, ఏపివో సిబ్బంది విధులు నిర్వహిస్తుంటారు. నియోజకవర్గంలో 23 సమశ్యాత్మక పోలింగ్ స్టేషన్ లుండగా ఇక్కడ లోపల, బయట సీసీ కెమరాలు ఏర్పాటు చేయడమే కాకుండా కేంద్ర బలగాలు భద్రత కల్పిస్తుంటారు. మిగతా కేంద్రాలలో పోలీసులు విధులు నిర్వహించనున్నారు. సోమవారం ఉదయం 6గంటల నుంచి సాయంత్రం 6గంటల వరకు జరిగే పోలింగ్ కేంద్రాల వద్ద 144 సెక్షన్ అమలులో ఉంటుందని స్థానిక సీఐ రాజ్‌కుమార్ తెలిపారు.

● గంగాధర: గంగాధరలో పార్లమెంటు ఎన్నిక లకు అధికారులు ఏర్పాట్లు పూర్తి చేశారు. మండలంలోని 33 గ్రామపంచాయతీల్లో 64 పోలింగ్ కేంద్రాలుండగా 192 మంది పోలింగ్ సిబ్బంది విధులు నిర్వహించనున్నారు. ఆదివారం సాయంత్రానికి పోలింగ్ కేంద్రాలకు ఈవీఎం ప్యాడ్లతో పోలింగ్ సిబ్బంది చేరుకున్నారు. మండలంలో బూరుగుపల్లి, గర్షకుర్తి గ్రామాలను సమస్యాత్మక గ్రామాలుగా గుర్తించి ఏలాంటి అవాంచనీయ ఘటనలు జరగ కుండా చర్యలు తీసుకున్నట్లు ఎస్ఐ కిరణ్‌రెడ్డి తెలిపారు.

● చిగురుమామిడి: పార్లమెంటు ఎన్నికల కోసం మండల వ్యాప్తంగా 40 పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేశారు. వివిధ శాఖలకు చెందిన 160 మంది సిబ్బందిని ఎన్నికల నిర్వహణకు కేటాయించారు. 75 మంది పోలీస్ సిబ్బంది బందోబస్తు విధుల్లో ఉన్నారు. ఇందులో డీఎస్పీ-1, సీఐ-1, ఎస్సై-1, మిగితా వారు పోలీస్ కానిస్టేబుల్స్ హోంగార్డులు ఉన్నారు. మండలాన్ని నాలుగు సెక్టర్లుగా ఏర్పాటు చేశారు. వీటికి గాను మండల వ్యవసాయాధికారి రంజిత్‌రెడ్డి-10 పోలింగ్ బూత్‌లు, ఎంపీడీవో మధుసుధన్-11, హార్టికల్చర్ ఏవో మంజులవాణికి-9, సైదాపూర్ పంచాయతీరాజ్ ఏఈ యాదగిరికి-10 కేటాయించారు. మండల వ్యాప్తంగా అన్ని గ్రామాల్లో ఓటర్లుకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా ఏర్పాట్లు చేసినట్లు మండల తహసీల్దార్ ఇప్పా నరేందర్ తెలిపారు. ఏ గ్రామంలో ఎలాంటి ఇబ్బందులు ఉన్నా వెంటనే తమ దృష్టికి తీసుకురావాలని ఆయన సూచించారు. గ్రామాల్లో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరుగకుండా ఎన్నికల ప్రశాంతాంగా జరిగేలా మండల ప్రజలు, అన్ని పార్టీల నాయకులు సహకరించాలని ఎస్సై బండి రాజేశ్ కోరారు.

● తిమ్మాపూర్: పార్లమెంట్ ఎన్నికలకు అధికారులు అన్ని ఏర్పాట్లు చేశారు. తిమ్మాపూర్ మండల వ్యాప్తంగా 57 పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేయగా, ఒక్క పోలింగ్ కేంద్రంలో పీవో, ఏపీవోతో పాటు ఇద్దరు అసిస్టెంట్లు ఎన్నికల విధులు నిర్వహించనున్నారు. ఇంకా మైక్రో అబ్జర్వర్లు, రూట్ ఆఫీసర్లు, వెబ్ కాస్టింగ్, పిఎల్‌వోలు, సిఆర్‌పిఎఫ్ దళాలు, పోలీసులు, ఇతర సిబ్బంది ఎన్నికల విధులలో పాల్గొంటున్నారు. పోలింగ్ కేంద్రాలలో ఎన్నికలు నిర్వహించేందుకు అధికారులు ఈవీఎంలతో పాటు ఇతర ఎన్నికల సామగ్రితో ఆదివారం సాయంత్రం తమకు కేటాయించిన బస్సులలో రూట్‌ల వారీగా చేరుకున్నారు. సోమవారం ఉదయం 5.30గంటలకు మాక్ పోలింగ్ నిర్వహించి ఈవీఎంలను పోలింగ్ ఏజెంట్ల సమక్షంలో పరిశీలించిన అనంతరం ఉదయం 7గంటలకు పోలింగ్ ప్రారంభం కానుంది. అన్ని పోలింగ్ కేంద్రాలలో అధికారులు అన్ని ఏర్పాట్లు చేశారు. కొన్ని చోట్ల కూలర్లు ఏర్పాటు చేస్తే మరి కొన్ని చోట్లు సరియైనా విద్యుత్ సౌకర్యం, ఫ్యాన్‌లు కూడా సరిగా లేవని ఎన్నికల విధులు నిర్వర్తిస్తున్న సిబ్బంది వాపోతున్నారు.

●మండలంలోని రామకృష్ణ కాలనీ గ్రామంలో మహిళ ఓటర్ల కోసం ప్రత్యేకంగా మోడల్ ఉమెన్స్ మేనెజ్‌మెంట్ మోడల్ పోలింగ్ స్టేషన్‌ను ఏర్పాటు చేశారు. మండలంలోని పర్లపల్లి గ్రామంలో ప్రత్యేకంగా మోడల్ పోలింగ్ స్టేషన్‌ను, పోరండ్ల గ్రామంలో వికాలంగుల కోసం ప్రత్యేకంగా మోడల్ పోలింగ్ స్టేషన్‌ను అధికారులు ఏర్పాటు చేశారు.

●మండలంలో ఏర్పాటు చేసిన మోడల్ పోలింగ్ స్టేషన్‌లతో పాటు ఇతర పోలింగ్ కేంద్రాలను జిల్లా అధికారులు ఆదివారం పరిశీలించి అధికారులకు, సిబ్బందికి పలు సూచనలు చేశారు. పోలింగ్ కేంద్రాలను పరిశీలించిన వారిలో డీఆర్‌డీవో శ్రీధర్, అదనపు డీఆర్‌డీవో సంధ్యరాణి, తహసీల్దార్ కనకయ్య, ఎంపీడీవో విజయ్ కుమార్, ఇతర అధికారులు, సిబ్బంది ఉన్నారు.


శంకరపట్నంలో ఏర్పాటు చేసిన మోడల్ పోలింగ్ కేంద్రం


పోరండ్ల పోలింగ్ కేంద్రంలో వికలాంగుల కోసం ఏర్పాటు చేసిన వీల్ చైర్


ఎల్ఎండీలోని పోలింగ్ బూత్‌లో ఈవీఎంలను పరిశీలిస్తున్న అధికారులు

కాంగ్రెస్ కార్యాలయంలో సర్వైవల్ టీం సోదాలు

కరీంనగర్ క్రైం, మే 12: కార్పొరేటర్లు, ఎమ్మెల్యేలతో సమావేశమై డబ్బులు, మద్యం పంపిణీ చేస్తున్నారని కరీంనగర్ ఎన్నికల సెల్‌కు వచ్చిన ఫిర్యాదుతో ఆదివారం సాయంత్రం జగిత్యాల రోడ్‌లోని కాంగ్రెస్‌పార్టీ ఎంపీ అభ్యర్థి వెలిచాల రాజేందర్‌రావు ఎన్నికల కార్యాలయంలో స్టాటిస్టికల్ సర్వైవల్ టీం అధికారులు, పోలీసుల పహారాలో సోదాలు నిర్వహించారు. సోదాల్లో ఎలాంటి డబ్బులు, మద్యం లభించలేదని తెలిసింది. సర్వైవల్‌టీం అధికారులు పోలీసులను వెంట తీసుకుని కార్యాలయం లోపలికి వెళ్లి సోదాలు చేయగా పోలీసులు బయట పహరా కాశారు. బీజేపీ నాయకులు ఎన్నికల సెల్‌కు ఫిర్యాదు చేసినట్లు సమాచారం. దీనిపై రెండో టౌన సీఐ విజయ్‌కుమార్‌ను వివరణ అడగగా సర్వైవల్ టీం అధికారులు సోదాలు చేసినది వాస్తవమేనని, కానీ ఎన్నికల అధికారులు ఎలాంటి ఫిర్యాదు అందలేదని తెలిపారు.

ఘనంగా మదర్స్ డే

కరీంనగర్ టౌన్, మే 12:నగరంలోని శ్రీమళయాల సద్గురు గీతామందిరంలో విష్ణుసేవానందగిరి స్వామీజీ ఆధ్వర్యంలో మదర్స్‌డే వేడుకలను నిర్వహించారు. ఈ సందర్భంగా 100మంది మహిళలను సన్మానించి, మాతృమూర్తి ప్రాముఖ్యతను స్వామీజీ వివరించారు. ఈ కార్యక్రమంలో బండ సత్యనారాయణ, ఉప్పల రామేశం, గుండ రాధాకిషన్, పాంపాటి గంగారాం, చిట్టిమల్ల దామోదర్ తదితరులు పాల్గొన్నారు. శ్రీసప్తగిరి వాకర్స్ అసోసి యేషన్ అధ్యక్షుడు గడప కోటేష్‌కుమార్ ఆధ్వర్యంలో మదర్స్ డేను పురస్కరించుకొని మహిళలను సన్మానించారు. ఈకార్యక్రమంలో కోశాధి కారి కనపర్తి రమేశ్, శరత్‌పటేల్, నాగరాజు, మక్బూల్ హుస్సేన్, శ్రీనివాస్, శ్రీదర్, సత్యం, నందు, డాక్టర్ లక్ష్మినారాయణ, సత్తయ్య, శంకరయ్య, ప్రకాశ్‌రెడ్డి, హుస్సేన్ తదితరులు పాల్గొన్నారు.

డిస్ట్రిబ్యూషన్ కేంద్రాన్ని సందర్శించిన సీపీ

హుజూరాబాద్, మే 12: హుజూరాబాద్ పట్టణంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలోని ఈవీఎంల డిస్ట్రిబ్యూషన్ కేంద్రాన్ని సీపీ అభిషేక్ మొహంతి ఆదివారం సందర్శించారు. ఈ సందర్భంగా సమస్యాత్మాక పోలింగ్ కేంద్రాల వద్ద తీసుకుంటున్న చర్యల గురించి ఏసీపీ శ్రీనివాస్‌జీని అడిగి తెలుసుకొని, పలు సూచనలు చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఎన్నికలు సజావుగా సాగేందుకు పోలీసులు అప్రమత్తంగా విధులు నిర్వర్తించాలన్నారు. పోలింగ్ బూత్‌ల వద్ద గ్రూపులుగా లేకుండా చూసుకోవాలన్నారు. కార్యక్రమంలో అడిషనల్ ఎస్పీలు, ఏసీపీ శ్రీనివాస్‌జీ, సీఐ రమేష్ తదితరులు పాల్గొన్నారు.


సైదాపూర్ మండలం వెన్నంపల్లిలో పోలింగ్ బూత్‌ను పరిశీలిస్తున్న సీపీ

● సైదాపూర్‌లో...

సైదాపూర్: మండలంలోని క్రిటికల్ పోలింగ్ కేంద్రమైన వెన్నంపల్లి హైస్కూల్‌లో నిర్వహించే పోలింగ్ కేంద్రాన్ని సీపీ అభిషేక్ మొహంతి సందర్శించారు. ఈ సందర్భంగా సిబ్బందికి పలు సూచనలు చేశారు. పోలింగ్ ప్రశాంతంగా నిర్వహించేందుకు తగు చర్యలు తీసుకోవాలని భద్రత సిబ్బందికి దిశా నిర్దేశం చేశారు. పోలింగ్ కేంద్రం వద్ద పూర్తిస్థాయిలో తగు జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ఈ పోలింగ్ స్టేషన్‌పై నిఘా ఉంచాలన్నారు. కార్యక్రమంలో సీఐ వెంకట్, ఎస్ఐ జన్ను ఆరోగ్యం, పోలీస్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

వాసవి వనిత క్లబ్, వాసవి వాగ్దేవి క్లబ్ ఆధ్వర్యంలో మాతృ పాదపూజ

సుభాష్‌నగర్, మే 12: వాసవి వనిత క్లబ్, వాసవి వాగ్దేవి క్లబ్ ఆధ్వర్యంలో మాతృ పాదపూజ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఆదివారం స్థానిక అశోక్‌నగర్‌లోగల వాసవి మాత ఆలయంలో మాతృమూర్తులకు పిల్లలు పాదపూజ చేసి ఆశీర్వాదం తీసుకున్నారు. ఈ కార్యక్రమానికి క్లబ్ జిల్లా గవర్నర్ జంధ్యం మాదవి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ తల్లి ఆశీస్సులు ఉంటే ఏదైనా సాధించవచ్చన్నారు. ఇలాంటి కార్యక్రమాల ద్వారా మన సంప్రదాయాలను భవిష్యత్ తరాలకు అందించవచ్చన్నారు. ఈ సందర్భంగా మాతృమూర్తులను శాలువతో సన్మానించారు. సేవా కార్యక్రమంలో భాగంగా చీరలను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో క్యాబినెట్ సెక్రటరి జంధ్యం మధుకర్, ఐపీఈ చందా రవీందర్, వాగ్దేవి వనిత క్లబ్ అధ్యక్షురాలు మాడిశెట్టి ఉమాదేవి, కార్యదర్శి ఎం స్వరూప, వనిత క్లబ్ అధ్యక్షుఆరలు చందా విజయలక్ష్మి, కార్యదర్శి నూనె పద్మ, కోశాధికారి అనురాధ, రాచమల్ల భద్రయ్య రెండు క్లబ్స్ బాద్యులు, సభ్యులు పాల్గొన్నారు.

వైభవంగా దుర్గాభవాని సుందరేశ్వరుల కల్యాణం

కరీంనగర్‌రూరల్, మే 12: కరీంనగర్ రూరల్ మండలం నగునూరులోని శ్రీ దుర్గా భవాని ఆలయ సప్తమవార్షికోత్సవాలు ఘనంగా నిర్వహిస్తున్నారు. ఆదివారం ఆలయ ప్రాంగణంలోని అమ్మవారి సన్నిధిలో దుర్గాభవాని సుందరేశ్వర స్వామి కల్యాణాన్ని ఆలయ ధర్మాధికారి వేద పండితులు పురాణం మహేశ్వరశర్మ ఆధ్వర్యంలో అంగరంగ వైభవంగా నిర్వహించారు. ఆది శంకరాచర్యుల జయంతి సందర్భంగా ఆలయ ప్రాంగణంలోని ఆదిశంకరాచ్యుల ఆలయంలో సంపూర్ణ అభిషేకం, ఫలపంచామృతాభిషేకం, భాష్యపారాయణం, నిర్వహించారు. ఈ కార్యక్రంమలో ఆలయ ఫౌండర్ చైర్మన్ వంగళ లక్ష్మణ్, ఆలయకమిటీ సభ్యులు పాల్గొన్నారు.

ఆలయాల్లో బండి సంజయ్ పూజలు


పెద్దమ్మతల్లిని దర్శించుకుంటున్న బండిసంజయ్‌కుమార్

భగత్‌నగర్, మే 12: నగరంలోని పలు దేవాలయాల్లో బీజేపీ జాతీయ ప్రధాన కార్యదర్శి, కరీంనగర్ బీజేపీ ఎంపీ అభ్యర్థి ప్రత్యేక పూజలు నిర్వహించారు. కిసాన్‌నగర్‌లోని కాళికామాత ఆలయాన్ని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. రామచంద్రాపూర్ కాలనీలోని పోతులూరి వీరబ్రహ్మేంద్రస్వామి ఆలయాన్ని దర్శించుకుని పూజలు చేశారు. పూజారుల ఆశీర్వచనం అనంతరం శ్రీశ్రీశ్రీ జగద్గురు ఆది శంక రాచార్య జయంతిని పుస్కరించుకుని వేడుకల్లో పాల్గొన్నారు. పెద్దమ్మ ఆలయంలో పూజలు నిర్వహించారు.

కాంగ్రెస్‌లో చేరిన బీఆర్ఎస్ కార్పొరేటర్ దంపతులు

కరీంనగర్ అర్బన్, మే 12: కరీంనగర్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని బీఆర్ఎస్ కార్పొరేటర్ అర్ష కిరణ్మయి, మల్లేషం దంపతులు ఆదివారం కాంగ్రెస్ పార్టీలో చేరారు. కరీంనగర్ పార్లమెంట్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి వెలిచాల రాజేందర్‌రావు అర్ష మల్లేశం దంపతుల మెడలో కండువాలు కప్పి వారిని కాంగ్రెస్ పార్టీలోకి ఆహ్వానించారు. బీఆర్ఎస్‌లో కొనసాగుతున్న అర్ష మల్లేశం గతంలో కాంగ్రెస్ పార్టీ ఎస్సీ విభాగం జిల్లా అధ్యక్షునిగా, కార్పొరేటర్‌గా పనిచేశారు. ప్రస్తుతం మల్లేశం సతీమణి కిరణ్మయి 23వ డివిజన్ కార్పొరేటర్‌గా పనిచేస్తున్నారు.


అర్ష మల్లేశంను పార్టీలోకి ఆహ్వానిస్తున్న వెలిచాల రాజేందర్‌రావు

● కాంగ్రెస్‌లో బల్మూరి చేరిక

తెలంగాణ ఉద్యమంలో కీలక పాత్ర పోషించిన బీఆర్ఎస్ సీనియర్ నాయకుడు, ప్రముఖ న్యాయవాది బల్మూరి మహేందర్ రావు కాంగ్రెస్ పార్టీలో చేరారు. రాష్ట్ర రవాణా, బీసీ సంక్షేమశాఖ మంత్రి పొన్నం ప్రభాకర్, జిల్లా కాంగ్రెస్ కమిటీ అధ్యక్షుడు, మానకొండూర్ ఎమ్మెల్యే డాక్టర్ కవ్వంపల్లి సత్యనారాయణ, కరీంనగర్ పార్లమెంట్ నియోజకవర్గ కాంగ్రెస్‌పార్టీ అభ్యర్థి వెలిచాల రాజేందర్‌రావు సమక్షంలో ఆయన కాంగ్రెస్‌లో చేరారు. బీఆర్ఎస్ వ్యవస్థాపకుల్లో మహేందర్‌రావు ఒకరు. తెలంగాణ జాగరణ సమితి రాష్ట్ర కమాండర్‌గా కూడా పనిచేశారు.

పార్టీ శ్రేణులకు మంత్రి పొన్నం దిశానిర్దేశం

కరీంనగర్ అర్బన్, మే12: కరీంనగర్ డీసీసీ కార్యాలయంలో ఆదివారం మంత్రి పొన్నం ప్రభాకర్ అధ్యక్షతన కాంగ్రెస్ పార్టీ ముఖ్య నాయకులు సమావేశమయ్యారు. సోమవారం జరిగే పార్లమెంట్ ఎన్నికలకు ఓటర్లను పోలింగ్ కేంద్రాల వద్దకు తీసుకువచ్చేందుకు నాయకులు అనుసరించాల్సిన విధానాలపై మంత్రి దిశానిర్దేశం చేశారు. నగరంలో పోలింగ్ శాతాన్ని పెంచేందుకు బూత్‌ల వారీగా ఇన్‌చార్జీలు జాగ్రత్తగా ఉండాలని సూచించారు. పోలింగ్ సమయంలో ప్రతిపక్షాల విషయంలో అందరూ అప్రమత్తంగా ఉండాలని అన్నారు.

కాంగ్రెస్‌లో చేరిన బీఆర్ఎస్ నాయకులు

సైదాపూర్, మే 12: సైదాపూర్ మండలంలోని లస్మన్నపల్లి గ్రామంలోని బీఆర్ఎస్ నాయకులు ఆదివారం కాంగ్రెస్ పార్టీలో చేరారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ పార్టీలో చేరిన మాతంగి వెంకటయ్య కొట్టే రాజిరెడ్డి, అందె వెంకటయ్య, చిన్న సమ్మయ్య, చంద్రమౌళి, శంకరయ్య, భూమయ్య, రమేష్, నరేష్, హరీష్, శ్రీనివాస్, వెంకటేష్ సంపత్‌లకు కాంగ్రెస్ నాయకులు పెసరు కుమారస్వామి, మ్యాకల మల్లారెడ్డి, మ్యాకల రవీందర్‌రెడ్డి, మాజీ జడ్పీటీసీ గుండార శ్రీనివాస్, పొన్నం వెంకన్న, శ్రీకాంత్‌రెడ్డి, రాజులు వారికి పార్టీ కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు.

చలివేంద్రం ఏర్పాటు

గంగాధర,మే 12: గంగాధర లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో చలివేంద్రం ఏర్పాటు చేశారు. గంగాధర బస్‌స్టేషన్‌లో ప్రయాణికుల సౌకర్యార్థం చలివేంద్రం ఏర్పాటు చేసినట్లు లయన్స్ క్లబ్ సభ్యుడు పర్రెం లక్ష్మారెడ్డి తెలిపారు. కార్యక్రమంలో సభ్యులు గుర్రం బాపురెడ్డి, ఎర్రం లక్ష్మణ్, గుడి అనంతరెడ్డి, సమ్మయ్య, వేముల మల్లేశం, అల్లవిజేందర్‌రెడ్డి, శ్రీరాం శ్రవణ్ తదితరులు పాల్గొన్నారు.

పార్వతీపరమేశ్వర కల్యాణం

కరీంనగర్ కల్చరల్, మే 12: నగరంలోని జెడ్‌పి క్వార్టర్స్ ఆవరణలోని శివాలయంలో ఆదివారం యెగుర్ల విజయలక్ష్మి అశోక్ దంపతుల సహకారంతో పార్వతీపరమేశ్వర కల్యాణాన్ని ఘనంగా నిర్వహించారు. అనంతరం అన్నదానం జరిగింది. కార్యక్రమంలో ఈఓ కొన్న కాంతారెడ్డి పాల్గొన్నారు.

భగవద్రామానుజుల జయంతి వేడుక

కరీంనగర్ కల్చరల్, మే 12: నగరంలోని జ్యోతీనగర్ ఆండాళ్‌గోష్టిలో ఆదివారం శ్రీవైష్ణవ వైదిక సేవాసమితి, వికాసతరంగిణి, జెట్ ఆధ్వర్యంలో భగవద్రామానుజాచార్యుల జయంతి వేడుకను ఘనంగా నిర్వహించారు. వేదభవనం ప్రిన్సిపాల్ డాక్టర్ కె వరప్రసాదాచార్యుల బృందం, శ్రీవైష్ణవ ద్విజుల ఆధ్వర్యంలో రామానుజాచార్యులవారికి ప్రత్యేక పూజలు చేశారు. కార్యక్రమంలో శ్రీవైష్ణవ వైదిక సేవాసమితి అధ్యక్ష, కార్యదర్శులు పీచర కృష్ణమాచార్యులు, గోవర్ధనగిరి శశికిరణ్ అచార్యులతో పాటు అచ్చి యాదగిరి ఆచార్యులు, వానమామలై శ్రీనివాసాచార్యులు, కెఎస్ అనంతాచార్యులు, వికాసతరంగిణి జిల్లా అధ్యక్షుడు కె గౌతమరావు పాల్గొన్నారు. సప్తగిరికాలని కోదండ రామా లయంలో జరిగిన వేడుకల్లో ఆలయ కమిటీ అధ్యక్షుడు కె గౌతమరావు పాల్గొన్నారు. శాతవాహన యూనివర్సిటీ వద్ద గల పివిఆర్ పంక్షన్‌హాల్లో ఉత్సవ నిర్వహణ సమితి, యతిరాజ సేవామండలి, వికాసతరంగిణి 148 విద్యానగర్ శాఖ ఆధ్వర్యంలో జరుగుతున్న కార్యక్రమంలో ఉభయ వేదాంత పండితుడు తూపురాణి శ్రీరమణీరంగాచార్యస్వామి పాల్గొన్నారు.